

కోటపల్లి మండలం పిన్నారం అటవీ ప్రాంతంలో పాతిపెట్టిన పులి కళేబరం(ఫైల్)

పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పులి కళేబరం(ఫైల్)

కొండపల్లి పులిదాడిలో మృతిచెందిన గిరిజన బాలిక(ఫైల్)

గత శుక్రవారం పులి దాడిలో మృతిచెందిన మోర్లె లక్ష్మి

గత శనివారం పులి దాడిలో గాయపడ్డ సురేశ్

## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 1 : బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ కరపత్రాలను మాజీ మంత్రి జోగు రామన్న విడుదల చేశారు. ఆదివారం శాంతినగర్‌లోని తమ నివాసంలో బజార్‌హత్నూర్ మండల యూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్ జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. క్రీడాకారులకు జోగు ఫౌండేషన్ తరపున ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, ప్రభాకర్, సుకుమార్, మని వర్ధన్ పాల్గొన్నారు.

• వరుస దాడులు

# భద్రతపై నీలినీడలు!

**ఉమ్మడి జిల్లాలో వణుకు పుట్టిస్తున్న టైగర్స్**

- నిత్యం ఎక్కడో ఒక చోట పశువులపై పంజా
- గన్నారంలో బాలికను చంపి 24 గంటలైనా గడవకముందే దుబ్బగూడలో మరో రైతుపై దాడి
- గతంలో విషప్రయోగంతో రెండు పెద్ద పులుల మృతి
- ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వాటి రక్షణపై పలు అనుమానాలు
- పులుల వివరాల గోప్యతపై కరువు
- అవగాహన కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు
- అటవీశాఖలో ఖాళీలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు
- కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో డీఎఫ్‌వోలు అందరూ ఇన్‌చార్జులే

మంచిర్యాల, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లోకి పులుల రాకపోకలు పెరగగా, సమీప గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువులు.. మనుషులపై దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం గన్నారం సమీపంలో పత్తి ఏరుతున్న మోర్ల లక్ష్మిపై దాడి చేసి చంపగా, అది జరిగి 24 గంటలైనా గడవక ముందే శనివారం సిర్పూర్-టీ మండలం దుబ్బగూడలో రైతు సురేశ్‌పై పంజా విసిరి తీవ్రంగా గాయపరిచింది. గతంలో పులులపై విషప్రయోగం జరగగా, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వాటి భద్రతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

### పులుల భద్రతపై అనుమానాలు

యేటా ఈ సీజన్‌లో మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి పులులు రాకపోకలు సాగిస్తుంటాయి. అవి రాకముందే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు.. దాడులు జరిగినప్పుడే స్పందించి ఆపై మిన్నకుండి పోతున్నారు. గతంలో జరిగిన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గతేడాది ఆసిఫాబాద్ జిల్లాలో ఓ పెద్దపులి.. దాని పిల్లలు పాడిపశువులపై దాడులు చేశాయి. విసిగిపోయిన పలువురు రైతులు పులి చంపేసిన పశువుపై విష ప్రయోగం చేశారు. ఆ మాంసాన్ని తిన్న పెద్దపులితో పాటు ఓ పిల్లపులి సైతం మృతిచెందింది. కాగజ్‌నగర్ డివిజన్ దరిగాంలో చోటు చేసుకున్న ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం పాడిపశువులనే చంపేస్తున్నాయన్న కోపంతోనే పులులకు విషం పెట్టినట్లు నిందితులు చెప్పారు. ఇప్పుడు సైతం అదే తరహాలో ప్రతి రోజూ ఏదో ఒక చోట పెద్దపులుల దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపులుల భద్రతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పులుల వివరాలపై గోప్యత ఏదీ..

సాధారణంగా అడవిలో పెద్దపులుల కదలికలుంటే ఆ వివరాలు బయటికి చెప్పకూడదు. వేటగాళ్లు పులులపై దాడి చేసే అవకాశాలు ఉంటాయని అధికారులు వివరాలను గోప్యంగా ఉంచుతారు. చలికాలంలో తోడు కోసం బయటికి వచ్చే పెద్దపులులు జనవాసాల్లోకి వస్తుండడంతో వాటిపై ఫోకస్ పెరిగింది. ఎక్కడ పులి కనిపించినా నిమిషాల్లో సోషల్ మీడియాలో అది చక్కర్లు కొడుతున్నది. అధికారులకు సమాచారం తెలిసేలోపే మీడియాలో పులి వార్తలు వస్తున్నాయి. పులి వివరాల్లో గోప్యత అన్నది ఎక్కడా కనిపించడం లేదు. బీట్ ఆఫీసర్లు, వాచర్లు, కొందరు అటవీ శాఖ అధికారులు పులి కదలికలపై డైరెక్ట్‌గా ప్రకటనలు ఇస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో జనవాసాల్లోకి వచ్చే పులుల గురించి సమాచారం ఇవ్వడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారు. పులులను ట్రాక్ చేయలేకపోతున్నారు. పులి తిరుగుతున్న సమీపంలోకి గ్రామాలు, గూడేలు, తండాల్లో ముందస్తు సమాచారం ఇచ్చి జనాలు ఎవ్వరూ బయటికి రాకుండా చూడాలి. కానీ అది సరిగా జరగడం లేదు. అందుకే పులుల దాడులంటూ వరుస ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు పులుల వివరాలపై గోప్యత పాటిస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

### ఇబ్బంది లేదు : శాంతారాం, ఎఫ్‌డీపీటీ

సాధారణంగా చలికాలంలో పులులు అడవుల్లోకి వస్తాయి. వాటి భద్రతపై ఎలాంటి సందేహాలు అవసరం లేదు. ప్రొటెక్షన్ స్ట్రక్చర్ బాగుంది. బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పులుల కదలికలు కనిపెడుతున్నారు. సీసీ కెమెరాలు సైతం బిగించి ఉన్నాయి. వాచర్స్, యానిమల్ ట్రాకర్స్ నిత్యం తిరుగుతూనే ఉన్నారు. కొంత ఖాళీలు ఉన్నాయి. ముఖ్యంగా బీట్ ఆఫీసర్ల ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటితో పెద్దగా ఇబ్బంది ఏం లేదు. ప్రజలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు.

### అటవీశాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు..

పులుల భద్రతపై అనుమానాలు తలెత్తడానికి ప్రధాన కారణం అటవీశాఖలో ఖాళీలు ఉండడమే. మరీ ముఖ్యంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఒక్క డీఆర్‌వో పోస్టులు తప్ప మిగిలిన పోస్టుల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. టైగర్ రిజర్వ్‌లో మంచిర్యాలలో తప్ప ఎక్కడా కూడా ఎఫ్‌డీవోలు పర్మినెంట్ వారు లేరు. చెన్నూర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఉట్నూర్ ఎఫ్‌డీవో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. జన్నారంలో ఏడాదిన్నరగా, చెన్నూర్‌లో నాలుగు నెలలుగా, బెల్లంపల్లిలో రెండున్నరేళ్లుగా, ఆసిఫాబాద్‌లో రెండేళ్లగా, ఖానాపూర్‌లో యేడాదిగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఉట్నూర్, కాగజ్‌నగర్ దాదాపు మూడేళ్లు ఖాళీగా ఉన్నాక అక్కడ ట్రైనీలకు పోస్టింగులు ఇవ్వనున్నారు. వచ్చే ఐఎఫ్‌ఎస్‌లు ట్రైనింగ్ పూర్తి చేసుకొని వెళ్లిపోతే అక్కడ మళ్లీ ఖాళీలు ఏర్పడనున్నాయి. ఖానాపూర్‌కు ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, ఆసిఫాబాద్‌కు జిల్లా డీఎఫ్‌వో నీరజ్ కుమార్, బెల్లంపల్లి, జన్నారం ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా మంచిర్యాల డీఎఫ్‌వో శిశ్ ఆశిశ్‌సింగ్, చెన్నూర్‌కు మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక బీట్ ఆఫీసర్ల పోస్టులైతే దాదాపు 45 శాతం వరకు ఖాళీ ఉన్నాయి. ఈ మధ్యే పది, పదిహేను మందికి గ్రూప్-4 ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. వంద పోస్టులు ఉంటే.. ప్రస్తుతం 45 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక ఎఫ్‌ఆర్‌వో పోస్టులు సైతం ఖాళీలుగా ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో ఒకటి, ఆసిఫాబాద్ డివిజన్‌లో ఒకటి, మంచిర్యాలలో ఒకటి, జన్నారంలో రెండు, ఖానాపూర్‌లో ఒకటి చొప్పున ఎఫ్‌ఆర్‌వో పోస్టులు ఖాళీ ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

# విద్యార్థుల రక్షణలో కాంగ్రెస్ విఫలం

• బీఆర్‌ఎస్వీ ప్రధాన కార్యదర్శి షేక్ పర్వేజ్



బీఆర్‌ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఆదిలాబాద్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ) : గురుకులాలతోపాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సమస్యలతో అవస్థలు పడుతుంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన వారోత్సవాలు జరుపుకుంటుందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ పర్వేజ్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్వీ గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన నాయకులతో కలిసి హౌసింగ్ బోర్డులోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల హాస్టల్‌ను సందర్శించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 300 మంది విద్యార్థులు కలుషిత ఆహారం బారిన పడ్డారని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకులాల సందర్శనకు వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని తెలిపారు. గురుకులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బుట్టి శివకుమార్, కౌన్సిలర్ పవన్‌నాయక్, నాయకులు దమ్మపాల్, పరమేశ్వర్, వాగ్మారే ప్రశాంత్, సతీశ్, రఘు, రాజేశ్, మోసిన్ సాబిర్, కలీం ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ధరణి రాజేశ్, నాయకులు



వంటశాలలో బియ్యంను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్



మావల పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్వీ నాయకులు

### మైనారిటీ గురుకులం సందర్శన

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 1 : రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న ఘటనలపై బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మెరకు ఆదివారం మండలంలోని మైనారిటీ గురుకులం పాఠశాలను బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జిల్లా కో-ఆర్డినేటర్ బుట్టి శివకుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి సమస్య, చర్మవ్యాధులు, బాత్‌రూంలకు డోర్స్ లేకపోవడం, వర్షం వల్ల క్లాస్ రూంలు ఉరవడం, కరెంటు స్విచ్ బోర్డులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. కిటికీలు లేకపోడంతో చలిలో నిద్రిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోడంతో కుక్కలు, పందులు, పాములు సంచరిస్తున్నాయని తెలిపారు. శానిటేషన్ సరిగ్గా లేకపోవడంతో దోమలు ప్రభలుతున్నాయని అన్నారు. కనీసం ఫ్యాన్‌లు కూడా బిగించలేదని ఆరోపించారు. నాసిరకం బియ్యంతో భోజనం పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో తక్షణమే హాస్టల్‌లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాగ్మారే ప్రశాంత్, మహ్మద్ ముజీబ్, పవార్ క్రాంతి, సాజీద్, తాజ్, రఘు, రాజేశ్, కలీం, షోహెబ్ మోసిన్, అభిలాష్, కల్యాణ్ పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం తనిఖీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 1 : ఆదిలాబాద్ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, వంటశాల, స్టోర్ రూమ్, సిక్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని, పరిసరాలు, వంటగది, వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## అభివృద్ధే ధ్యేయం

• బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, డిసెంబర్ 1 : బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం వాగ్దారి గ్రామంలో ఫార్మేషన్ రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్యలు ఏవైనా ఉంటే సమాచారం ఇస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. గతంలో ఎప్పుడు వచ్చిన గ్రామస్తులు ఈ రోడ్డు గురించే ప్రస్తావించే వారని, ఇప్పుడు వారి కోరిక మేరకు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు నాలుగు రోజుల్లో నాలుగు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాబులాల్, మారుతి, గులాబ్, చంద్రశేఖర్, మహేందర్, విలాస్, సంతోష్, సురేందర్, కమలాకర్, వెంకటేశ్, రమణ, సంజీవ్, గంగాధర్, గోపీ, మారుతి, కిశోర్ పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

ఆస్పత్రిలో ఖర్చులు అయిన వారు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులను పొంది సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన లక్ష్మికి రూ.10,000, ఇచ్చోడ మండలంలోని జల్ద గ్రామానికి చెందిన అరుణకు రూ.31,500, ముక్రా గ్రామానికి చెందిన మన్సూర్ అలీకి రూ.12వేలు, ముఖ్రా(బి)కి చెందిన పద్మిని బాయి కి రూ.19,500లను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు

## ఆరట్టు శోభాయాత్రలో రామన్న దంపతులు

ఎదులాపురం, డిసెంబర్ 1 : రవీంద్రనగర్‌లోని ఉమా మహేశ్వరం అయ్యప్ప ఆలయం నుంచి చేపట్టిన ఆరట్టు శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. దామోదర్ గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవ యాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీని ఊరేగిస్తూ కొనసాగింది. ఈ శోభాయాత్ర శాంతినగర్ సాయిబాబా మందిరం వరకు చేరుకోగా మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవితో కలిసి పల్లకీ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాముల ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బారే శ్రీధర్, అశోక్, వేణు గోపాల్, కైలాశ్ పటేల్, సంతోష్, భోజన్న పాల్గొన్నారు.